# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## ముఖ్యమంత్రికి శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21వ తేది నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఇఓ టి.బాపిరెడ్డి ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అందించారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి మధ్యాహ్నం 4.30గంటలకు రానున్నట్లు కార్యక్రమాలు ఖరారు చేసారు. మహాశివరాత్రి ఆహ్వాన పత్రికలను అందించిన ఎంఎల్‌ఏ వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలను అందించారు. మొదట శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలతో పాటు దుశ్శాలువతో సత్కరించారు. ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డితో పాటు ఇఓ టి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎ న్ ఆర్ కృష్ణారెడ్డి, వేదపండితులు శివప్రసాద్ శర్మ, ప్రభాకర్‌శర్మ, అవినాష్ శర్మ ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఎఇఓ హేమామాలిని తదితరులున్నారు.

## జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి విద్య ఫిబ్రవరి 10 ప్రభాత వార్త



హైదరాబాద్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమ్ఎస్ ఎమ్ఈ సహకారంతో మహిళా విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల జాతీయ సదుస్సు సోమవారం ప్రారంభమైంది. అడ్వాన్డ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్, ఫైలింగ్‌ఖి విధానాలపై జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిలుగా వీసీ ప్రొఫెసర్ ఉమ, ఎమ్ఎస్ఎమ్ఈ ప్రోగ్రాం డైరెక్టర్ స్వప్న హాజరయ్యారు. భారతదేశంలోని ఎంట్రపెన్యూర్స్ విషయంలో పేటెంట్ చట్టాలు, నిబంధనలు, ఫైలింగ్ ప్రాసెస్ వంటి అంశాలతో పాటు ఎమ్ఎస్ఎమ్ఈ పథకాలు పై అవగాహన కల్పించారు. సదస్సులో రిజిస్ట్రార్ రజిని, పలు రాష్ట్రాల నుంచి విచ్చేసి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు.

## సమ్మకంతో రూ.1 కోటి 20లక్షలు, 25 సవరాల బంగారం తీసుకున్నాడు

**- ఓ సైబర్ క్రైమ్‌లో తను కొనిచ్చిన ఫోన్ల ద్వారా ఆర్థిక నేర లావాదేవీలు జరిపాడు**

**- బాధితురాలు లక్ష్మి**

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు లక్ష్మీరెడ్డి

తనకు రాజకీయంగా ఎదుగుదల ఉందని, ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందని నమ్మించి 1.20కోట్ల రూపాయలు నగదు, 25సవరాల బంగారు తీసుకుని కిరణ్‌రాయల్ తనను మోసం చేశాడని బాధిత మహిళ లక్ష్మీరెడ్డి ఆవేదన వెలిబుచ్చింది. అతని మాటలు నమ్మి ఆలస్యంగా మోసపోయానని, పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆమె సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో కన్నీటిపర్యంతమైంది. దీంతో నా అమ్మ కుటుంబం, నా అత్త కుటుంబం, నా కుటుంబం మూడు కుటుంబాలు రోడ్డున పడ్డాయని బాధ పడ్డారు. అడిగినప్పుడప్పుడల్లా డబ్బులు, బంగారం ఇవ్వకుంటే కొట్టేవాడు, తిట్టేవాడు, అంతే కాకుండా గాయపరిచి ఆస్పత్రి పాలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆమె తెలిపారు. గత రెండు రోజులుగా తనపై కిరణ్‌రాయల్ లేనిపోని ఆరోపణలు చేస్తూ కొన్ని మీడియా లైవ్‌లో తనపై బూతు పురాణాలు చేస్తున్నాడు. 2013లో తనకు కిరణ్‌రాయల్ మధ్య ఆర్థిక లావాదేవీలు పూర్తి అయ్యాయని చెప్పడం దారుణమన్నారు. మరో అమ్మాయిని మోసం చేశాడు, ప్రస్తుతం నన్ను, మరో అమ్మాయితో ప్రేమ కలాపాలు చేస్తూ ఆ అమ్మాయిని కూడా మోసం చేస్తున్నాడు. అమ్మాయిల దగ్గర డబ్బులు అయిపోయాంటే ఆ అమ్మాయిలను తొందరగా వదిలించుకునేందు అడ్డదారులు తొక్కుతాడు. అందులో ఇది ఒక మార్గం. ఇలాంటి మోసగాడు భారీన మరింత మంది మహిళలు మోసపోకూడదని సూచించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ పూర్తి అయిన తర్వాత ప్రెస్‌క్లబ్ గేటు ముందుకు రాగానే బాధితురాలు లక్ష్మీరెడ్డి నిజైపూర్ పోలీసులు అదుపులోకి తీసుకోవడం కొసమెరుపు.

## జనసేననేత కిరణ్‌రాయల్ కేసులో

# బిగ్ ట్విస్ట్!

**బాధితురాలు ఉదయం ఎస్పీకి ఫిర్యాదు.. గంటలోనే జైపూర్ పోలీసులు అరెస్టు**



తిరుపతి ప్రెస్‌క్లబ్ గేట్ ముందర లక్ష్మీరెడ్డిని అరెస్టు చేస్తున్న జైపూర్ పోలీసులు

తిరుపతి, ఫిబ్రవరి 10ప్రభాతవార్త:

తిరుపతినగరం జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ పై 1.20కోట్ల రూపాయలు మోసం చేశాడనే ఆరోపణల కేసులో బిగ్‌ట్విస్ట్ నెలకొంది. బాధిత మహిళ తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన లక్ష్మీరెడ్డి సంఘటనలో సోమవారం ఉదయం నుండి తిరుపతిలో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల్లో ఉదయం ఆమె ఎస్పీకార్యాలయానికి వెళ్ళి ,ఎస్పీని కలిసి తనను కిరణ్‌రాయల్ మోసం చేశాడని, అన్నివిధాలా తనను వాడుకుని కుటుంబాన్ని నాశనం చేశాడని ఫిర్యాదు చేసింది. గంటలోనే ఆమెను జైపూర్ పోలీసులు తిరుపతిలో చుట్టుముట్టి చివరకు అరెస్టుచేసి తీసుకెళ్ళడం మరింత సంచలనంగా మారింది. ఆన్‌లైన్‌లో ఆర్థికలావాదేవీలు చేసిందని, పలురాష్ట్రాల్లో ఆమెపై కేసులు ఉన్నాయని, అయితే ఆమె ఎక్కడ ఉందనేది కనుక్కోలేక చివరకు మీడియాల్లో ప్రసారంతో తిరుపతికి చేరుకుని అరెస్టుచేశామని జైపూర్ పోలీసులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ రాష్ట్రపోలీసులు సడన్‌గా వచ్చి అరెస్టుచేయడంతో బాటు చెక్‌బౌన్స్ కేసులో, సైబర్‌క్రైమ్ కేసు కూడా ఉందని తెలిపారు. దీంతో ఇప్పుడు ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. కిరణ్‌రాయల్ తనను అన్నివిధలా నమ్మించి మోసం చేశాడని, అతని మాటలకు నమ్మి తన ఆస్తినంతా అమ్ముకుని సాయంచేశానని, తన పిల్లల భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్నానని, పోలీసులు సహాయం చేయాలని ఉదయం ఎస్పీ కార్యాలయం ముందు మీడియాతో కన్నీటిపర్యంతం అయ్యింది. ఈ ఆరోపణల్లో కొన్ని ప్రైవేట్ వీడియోలను ఆమె బయటపెట్టింది. మధ్యాహ్నానికి ఆమెను జైపూర్ పోలీసులు అరెస్టుచేసి చెన్నైమీదుగా ఆ రాష్ట్రానికి తరలించడం మాత్రం బిగ్ ట్విస్ట్ నెలకొంది. తనకు ఏ పార్టీతో సంబంధంలేదని, తనకు ఎవరూ తెలియదని చెప్పింది. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తన పరిస్థితి పట్ల స్పందించి న్యాయం జరిగేలా చూడాలని ఆమె వేడుకుంది. కిరన్‌రాయల్ ఇతరులు తనపట్ల దారుణంగా మాట్లాడుతున్నారని ఆమె కన్నీటిపర్యంతమైంది. ఇప్పుడు జరగుతున్న పరిణామాలతో బాధిత మహిళ పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందనడంలో సందేహం లేదు.

## 'కల్తీ' నెయ్యి కేసులో

# నెక్ట్స్‌అరెస్టులో పాత్రదారులు ఎందరో!

**-కీలక సూత్రధారులకు నోటీసులు జారీ చేస్తారా?!**



ప్రభాతవార్త-తిరుపతి:

తిరుమల వెంకన్న లడ్డూల తయారీలో కల్తీనెయ్యి పాపానికి కారకులను గుర్తించిన సిబిఐ సిట్ అధికారులునలుగురు కీలక వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఇంకొన్ని సంచలన నిజాలు వెలుగుచూస్తుండటంతో తదుపరి కల్తీనెయ్యి సరషరాకు అనుమతినిచ్చి, సరపరా చేసిన పాత్రదారులు అరెస్టుకానున్నారనేది సంచలనంగా మారింది. ఇప్పటికే టిటిడికి సరఫరా చేసిన కల్తీనెయ్యి ఘటనపై 470/2024 తిరుపతి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు ఆధారంగానే నెలన్నర రోజుల క్రిందట మూలాలు కదిలించి పక్కా ఆధారాలతో సిబిఐ అధికారులు రంగంలోకి దిగారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిలు తమిళనాడు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పూనంబాక)సిఇఓ అపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను సిబిఐ అధికారులు ఆదివారం అరెస్టుచేశారు. ఇప్పుడు కొందరు పాత్రధారులు సిబిఐ అదుపులో ఉన్నారని, వారినుండి సమగ్ర సమాచారం రాబడుతుండటంతో రానున్న రోజుల్లో కల్తీనెయ్యి పాపంలో సూత్రధారులైనదోషులెవరనేది తేల్చేందుకు నిమగ్నమయ్యారు. లడ్డూల తయారీలో వినియోగిస్తున్న ఆవునెయ్యిలో ఏకంగా పందికొవ్వు, గొడ్డుకొవ్వునూనెలతోబాటు శాఖాహారపదార్థాలతో తయారుచేసిన నూనెలు కల్తీచేసి పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కుపంపాల్సిన టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాత్రలో కొందరికి నోటీసులు జారీచేసి, తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. పవిత్రమైన లడ్డూలను కలుషితంచేసిన పాపంలో క్లైమాక్స్‌లో శిక్ష ఎవరికి పడనుందనేది త్వరలోనే తేలిపోనుంది. అయితే గత టిటిడి పాలకమండళ్ళ పెద్దలకు, కొనుగోలుకమిటీలోని సభ్యులు, అధికారుల తలకు ఈ పాపం చుట్టుకోనుందనేది తిరుపతిలో హాట్‌టాపిక్.

## లాటరీ ద్వారా 9 మద్యం షాపులు కేటాయింపు




లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపులను కేటాయిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

గీత కుల, ఉప కులాలకు రిజర్వ్ చేయబడిన మద్యం షాపులను లాటరీ ప్రక్రియ ద్వారా సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఖరారు చేశారు. డిఆర్‌డిఏ సమావేశభవనంలో సోమవారం గీత కుల, ఉప కులాలకు కేటాయించిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో గీత కుల, ఉప కులాలకు 10 మద్యం షాపులను లాటరీ పద్ధతి ద్వారా కేటాయించాల్సివుండగా సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పెద్దపంజాణి మండలం మినహా మిగిలిన 9 మద్యం షాపులను గీత కుల, ఉప కులాలకు లాటరీ పద్ధతిలో కేటాయించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, నగరి మున్సిపాల్టీ, పలమనేరు మున్సిపాల్టీ, పుంగనూరు మున్సిపాల్టీ, చిత్తూరు రూరల్ మండలం, గుడిపల్లి మండలం, పాలసముద్రం మండలం, వి.కోట మండలం, వెదురుకుప్పం మండలాలకు కేటాయించిన షాపులను కలెక్టర్ సుమిత్‌కుమార్ లాటరీ విధానంలో కేటాయించారు. ఈ లాటరీ ప్రక్రియ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ విజయశేఖర్, ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్

**ప్రభుత్వ కార్యాలయాల్లో లక్షల్లో ఆస్తి నష్టం**
**పరుగులు తీసిన అధికారులు, సిబ్బంది**





ఐరాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

ప్రమాదవశాత్తు తొండ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌పై పడడంతో సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి కంప్యూటర్లు, ఫ్యాన్‌లు కాలిపోవడంతో లక్షల్లో ఆస్తినష్టం జరిగిన సంఘటన మండల కేంద్రం ఐరాలలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...మండల కేంద్రం ఐరాల శివారు(ఐరాల-చిత్తూరు రహదారి)లో ఎంపీడీఓ, తహశీల్దార్, వెలుగు, హౌసింగ్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు వున్నాయి. సోమవారం గ్రీవెన్స్‌డే కావడంతో ఆయా కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యారు. ఈనేపథ్యంలో ఈకార్యాలయాలకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌పార్మర్ లైన్‌పై తొండ పడడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీనితో ఒక్కసారిగా ఆయా కార్యాలయాల్లోని విద్యుత్ మీటర్లు, ఎంసీబిలు. వైరింగ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలపోయాయి. దీనితో ఆయా కార్యాలయాల్లోని సుమారు 19 కంప్యూటర్లు, ఫ్యాన్‌లు కూడా కాలిపోయి నిప్పురవ్వలు ఎగిసి పడుతూ పొగ పూర్తిగా కమ్మేయడంతో కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఏమి జరిగిందో అంటూ భయంతో బయటకు పరుగులు తీశారు. సంఘటన జరిగిన సమయంలో వ్యవసాయశాఖకు సంభందించి వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండడంతో వారు కనెక్షన్‌ను తొలగించి బయటకు పరుగులు పెట్టారు. ఈసంఘటనతో కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. ఈప్రమాదంలో సుమారు లక్షల్లో ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద సంఘటన గురించి అధికారులు ఐరాల ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించడంతో ఏఈ నీరజ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయం మినహా మిగిలిన కార్యాలయాలకు మీటర్లు వరకు, వీధి లైట్లుకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ ధనలక్ష్మీ మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కంప్యూటర్లు కాలిపోవడంతో పాటు ఫ్యాన్‌ల నుండి నిప్పురవ్వలు మీదపడడంతో తాము భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు. ప్రమాదంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో భారీ ఎత్తున నష్టం జరిగి వుండవచ్చునని తహశీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. నిపుణులు పరిశీలిస్తే ఎంతమేర నష్టం జరిగిందనేది తెలుస్తోందని తెలిపారు. ఈప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## గీత కులాలకు మద్యం షాపుల కేటాయింపు ద్వారా

# రూ.4 కోట్ల 82లక్షల ఆదాయం






తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా వ్యాప్తంగా గీత కులాలకు మద్యం షాపులు కేటాయించడం ద్వారా రూ. 4 కోట్ల 82లక్షల ఆదాయం వచ్చినట్లు తిరుపతి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మున్సిపల్ కార్పొరేషన్లకు, మున్సిపాలిటీలకు, మండలాలకు 23 మద్యం షాపులను కేటాయించి దరఖాస్తులు ఆహ్వానించగా 185 దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల ద్వారా స్వీకరించడం జరిగిందన్నారు. గీత కులాల వారికి సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ వారి ఆధ్వర్యంఓ లక్కీ డ్రా నిర్వహించి మద్యం షాపులను కేటాయించడం జరిగిందని తెలియజేశారు. సదరు మద్యం షాపులకు 185 దరఖాస్తులను స్వీకరించడం ద్వారా రూ. 3 కోట్ల 70లక్షలు దరఖాస్తు రుసుము రూపంలో, మొదట కంతు రీటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ద్వారా రూ. 1 కోటి 12లక్షలు మొత్తం రూ. 4 కోట్ల 82లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమకూరినట్లు ఆయన పేర్కొన్నారు. సదరు 23 మద్యం షాపులు మంగళవారం నుంచి వ్యాపారం నిర్వహించుటకు ప్రొవిజనల్ లైసెన్సులను మంజూరు చేసినట్లు నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలియజేశారు.

## ఎవరైనా అక్కడ నిలబడి మాట్లాడాల్సిందే

**ఇదీ తొట్టంబేడు తహశీల్దార్ వారి కార్యాలయ తీరు**

తొట్టంబేడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త



'ఎంతటి వారైనా ఆ కార్యాలయానికి వెళితే తన ఛాంబర్‌లో నిలబడి మాట్లాడాల్సిందే. ఉన్న కుర్చీలను తొలగించారు. ఎవరైనా తనకు సంబంధించిన వారు వస్తే కనుచూపు సైగతో అటెండర్ ఒక కుర్చీ తెస్తారు. ఆయన కూర్చోమనే వరకు నిలబడాల్సిందే. ఇదీ నేడు తొట్టంబేడు మండల రెవెన్యూ కార్యాలయం పని తీరు. మరి దీనిని క్రమశిక్షణ అనాలా? లేక మనం బ్రిటిష్ పాలనలో ఉన్నామనుకోవాలో తెలియని స్థితి. రెవెన్యూ శాఖలో అన్ని విభాగాల్లో అధికారులు తమ ఛాంబర్‌లో వచ్చే అతిథులను గౌరవించటానికి కుర్చీలువేసి కూర్చోబెట్టి మాట్లాడటం చూస్తుంటాము. కానీ తొట్టంబేడు మండలంలో మాత్రం ప్రత్యేక వాతావారణం చోటు చేసుకుందనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి. తహశీల్దార్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌కు వస్తే ఎవరైనా చేతులు కట్టుకొని క్రమశిక్షణ కల్గిన విద్యార్థిలా తమ గోడును విన్నవించుకోవాల్సిందేనా? అని నొచ్చుకుంటున్నారు. ఇది ప్రజా స్వామ్య వ్యవస్థ అనే విషయాన్ని అధికారి మరచినట్లుంది. ఇక్కడ తీరు మారాల్సి ఉందని పలువురు భావిస్తున్నారు. అయితే గతంలో ఇక్కడ కుర్చీలు ఉండేవని అయితే వాటిని ప్రస్తుత అధికారి వచ్చిన తరువాత తొలగించారనే విమర్శలూ ఉన్నాయి.

## నూతన బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే పాశం

గూడూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త




రాష్ట్ర ప్రభుత్వం గూడూరు డిపోకు నూతనంగా మంజూరు 9 నూతన బస్సులను గూడూరు ప్రాంగణం నందు అధికారులు, నాయకులతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంది రాష్ట్రం గతంలో ఎప్పుడైనా ఎక్కడైనా నూతన బస్సులు ప్రారంభించిన దాకలాలు లేవు. మొన్న వాకాడు డిపో నందు 10 నూతన బస్సులను ప్రారంభించారు. గూడూరు డిపో నుండి 9 కొత్త బస్సులను ప్రారంభిస్తున్నామన్నారు. ఒక్కోబస్సు విలువ సుమారు 60 లక్షల రూపాయలు ఉంటుంది. 5 కోట్ల 40 లక్షల రూపాయలతో బస్సులను ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నియోజకవర్గంలో 27 బస్సులను ప్రారంభించామన్నారు. వీటి విలువ సుమారుగా 16 కోట్ల 20 లక్షల రూపాయలు ఈ నియోజకవర్గానికి బస్సులును మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, విద్యాశాక మాత్యులు నారా లోకేష్ బాబు గారికి, రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ మినిస్టర్ రామ్ ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. గూడూరు డిపో దీలీకి శుభాకాంక్షలు తెలుపుతున్నాను ఈ కార్యక్రమంలో ఆర్టిసి ఆర్ఎం నరసింహులు, డిఎం వెంకటేశ్వర్లు సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి పులిమి శ్రీనివాసులు మట్టం శ్రావణి గుండాల లీలావతి కొండూరు వెంకటేశ్వరరాజు, గుండాల శ్రీదేవి, గుండాల భారతి, వాటం భేటీ శివకుమార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## బెండపల్లి చెరువు 'చెర' పడుతున్నారు

**- పగలు రాత్రి తేడా లేకుండా యధేచ్ఛగా మట్టి తరలింపు**

శాంతిపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

కాదేదీ కబ్జాలకు అనర్హం అనే రీతిలో కొంతమంది అక్రమార్కులు చివరకు చెరువులను సైతం చెరపడుతున్నారు. ఇష్టారాజ్యంగా చెరువుల్లోనుంచి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని అబకలదొడ్డి పంచాయతీలో బెండపల్లి చెరువు ఉంది. ఈ చెరువులో నీరు లేకపోవడంతో కొందరు స్వార్థపరులు సోమవారం ఏకంగా మూడు జెసిబిలు, 25 ట్రాక్టర్లతో చెరువులోని మట్టిని యధేచ్ఛగా తరలించారు. ఈ విషయం గ్రామస్తులు 'ప్రభాతవార్త'కు తెలియజేయగా గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లి చూడగా ఉదయం నుంచి అక్కడ జెసిబిల సాయంతో మట్టిని తరలించిన వాస్తవాలు వెలుగు చూశాయి. చెరువు మొత్తం గుంతలుగా మార్చేస్తున్నారు. ఈ సమయంలో ఫోటోలు తీసే యత్నం చేయగా కొందరు ట్రాక్టర్లను, జెసిబిలను తీసుకెళ్లగా మరికొందరు అక్కడే తిష్ట వేశారు. ఈ విషయంగా తహశీల్దార్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా తమకు విషయం తెలియదని వెంటనే విఆర్వోను పంపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు ఉంటే సీజ్ చేస్తామని తెలిపారు. అంతలోనే అక్రమార్కులు చెరువులోనుంచి తమ వాహనాలను తీసుకెళ్లిపోయారు. కాగా రెడ్లపల్లి, జంగాలపల్లి, కోతిగుట్లపల్లి గ్రామాలపరిధిలో వచ్చే ఈచెరువులో అక్రమ మట్టి తవ్వకాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



జెసిబితో చెరువులో మట్టి తీస్తున్న దృశ్యం

## ఐరాలలో పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

ఐరాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఐరాల ప్రాథమిక కేంద్రం పరిధిలోని పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండలంలోని పొలకల జడ్పీ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పొలకల పంచాయతీ ఉపసర్పంచ్ సురేంద్రనాయుడులు విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్‌బెండ్ జోల్ మా త్రలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈమేరకు పీహెచ్‌సీ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు, అంగన్‌వాడి కేం ద్రాల్లోని 1 నుండి 19 ఏళ్ళు లోపు పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోండి

తవణంపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మండలంలోని ఖాళీగా వున్న అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని ఐరాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జి.నిర్మల తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లె అంగన్‌వాడీ వర్కర్ (ఓసి), ద్వారకాపురం హెల్పర్ (ఎస్‌సి) పోస్టులు ఖాళీగా వున్నట్లు తెలిపారు. వీటికి ఈనెల 22 లోగా అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలపారు. ధరఖాస్తు అభ్యర్థులు 21 నుండి 35 ఏళ్ళు లోపు వయస్సు కలిగి వుండి వివాహితులైన స్థానికులుగా వుండాలని సీడీపీఓ. నిర్మల తెలిపారు. అభ్యర్థులు సంభందిత దృవీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారితో దృవీకరణ చేయించి ధరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

## మాల కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కూటమి నాయకులు

కాణిపాకం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్‌ను పూతలపట్టు నియోజక వర్గ జనసేన నాయకులు సోమవారం తిరుమలలో మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయనకు తిరుమలలో జనసేన నాయకులు మహేష్‌స్వేరో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటంలో పాటు కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌లు పొన్నం యుగంధర్, పూరిమిట్ల కుమారి, జనసేన నాయకులు అజిత్‌కుమార్, పవన్, యువరాజ్, దినేష్, కిరణ్, కిరణ్‌కుమార్, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఫైబర్ నెట్ సేవలు విస్తరించండి

పాకాల, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

పాకాల మండలం పరిసర ప్రాంతాలలో ఏపీ ఫైబర్ నెట్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి తరచూ మాకు విజ్ఞప్తులు అందుతున్నాయనిబిజెపి వెంకటాద్రి నాయుడు పేర్కొన్నారు. పాకాల మండలంలో వర్క్ ఫ్రమ్ హోమ్ సాఫ్ట్వేర్ ఉద్యోగం చేసే యువత ఎక్కువగా ఉన్నందున వారి కోరకు, తక్కువ ధరకే ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ఇంటర్నెట్, కేబుల్ టీవీ, మండలంలోని పల్లె ప్రజలుకు ఫైబర్ గ్రిడ్ కనెక్టివిటీ ద్వారా వీలైనంత త్వరగా అన్ని గ్రామాలలోని ప్రతి ఇంటికి శెట్టిఫ్ బాక్సలు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవలసినదిగా ప్రజలు, వెంకటాద్రి నాయుడు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## అనిమియా నివారణకు ఆల్‌బెండజోల్ వాడాలి : డాక్టర్ ప్రవీణ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :

అనిమియా నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రమే పరిష్కారమని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ప్రవీణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెదురుకుప్పం నందు జాతీయ నివారణ దినోత్సవం పురష్కరించుకుని సోమవారం బడి ఈడు పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రాలు పంపిణీ, అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు మెలుకువలు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని పాఠశాలలకు, కళాశాలలకు, అంగన్‌వాడి కేంద్రాలు 5020 మంది విద్యార్థులను గుర్తించి మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడివో అమర్నాధ్, మండల విద్యాశాఖాధికారులు ఉమామహేశ్వర్‌రావు, దామోదరం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న చంద్ర మౌళీశ్వర స్వామికి విశేష పూజలు

కల్లూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం కల్లూరు శ్రీ ప్రసన్న చంద్ర మౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్ర రావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## మదర్‌థెరిసాలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పెద్దపంజాణి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:



మండలంలోని మదర్ థెరిసా పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సోమవారం డా.ఖలీల్ ఉల్లా అధ్యక్షతన, పాఠశాల కరస్పాండెంట్ డా.రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ డా.డేవిడ్ బెర్కిమాన్ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధ, కృషితో విజయాలను సాధించాలని సూచించారు. విద్యతో ఉన్నత స్థాయికి ఎదగాలని, ఉన్నత ఆశయాన్ని కలలు కంటు వాటి సాధనకై కృషి చేయాలన్నారు. తమ పాఠశాల విద్య, సాంస్కృతిక, క్రీడా రంగాలలో అత్యుత్తమ ప్రదర్శనను అందించడానికి ఎల్లప్పుడు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని నియోజకవర్గ బెస్త సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి కోరారు. సోమవారం మధ్యాహ్నం ఈ మేరకు ఎమ్మార్వో కార్యాలయంలో సంఘ సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు, అలాగే పుంగనూరులో చేపల మార్కెట్‌కు స్థలాన్ని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభా భారతి, సునీత, షబానా, గంపల గంగరాజు, చిట్టెమ్మ, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నూతన సాంకేతికతను విద్యార్థులు సద్వినియోగించుకోండి

### ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

నూతన సాంకేతికతను విద్యార్థులు సద్వినియోగించుకొని ఆవిష్కరణపై అవగాహన పెంపొందించుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు అధిక సమయం సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేస్తున్నారని, దీంతో విద్యార్థులకు వారి సమయం వృదాకావడం తప్ప వచ్చే లాభాలేవీ లేదన్నారు. నేటి నూతన సాంకేతికత, ఆవిష్కరణలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని దీంతో విద్యార్థులకు కొత్తపాటి ఆలోచనలు వస్తాయని ఆ ఆలోచనలు వారికి నూతన ఆవిష్కరణలు రూపొందించేలా చేస్తాయన్నారు. అనంతరం పట్టణంలోని బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి, కో ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి.బాలాజీ, జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డా.అర్పిత, ఎంఈఓ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్రపై అధ్యయన తరగతులు

పూతలపట్టు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

పూతలపట్టు గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం భారత రాజ్యాంగం భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యయన తరగతులు పూతలపట్టు సర్పంచి మాసల మని చేతుల మీదుగా పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రంధాలయ అధికారి తాళ్ల రవీంద్రబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి సర్పంచ్ మాస్లమణి మాట్లాడుతూ త్యాగశీలి ఆయన చేసినటువంటి సేవలు మర్చిపోలేనివన్నారు. జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి మాట్లాడుతూ అంబేద్కర్ లేకుంటే మా జీవితాలు లేవు అన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ కంట్రోలర్ మాసలమణి మాట్లాడుతూ పేదల పెన్నిధి ఆశాజ్యోతి జీవితం అంతా కూడా దళిత జాతి జ్యోతిగా మారిపోయారు అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ షణ్ముగం, బయటపల్లె పంచాయతీ సర్పంచ్ బాలాజీ, జూనియర్ కాలేజీ లెక్చరర్ శ్రీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు నాదముని, ఐరాల ప్రభాకర్, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాల గ్రాహ్యతను మెరుగు కోసమే అల్‌బెండజోల్

చౌడేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త



పోషకాల గ్రాహ్యతను మెరుగు పరచేందుకు అల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేసారు. కడుపులో నులిపురుగుల వల్ల అంటువ్యాధులు విజృంభిస్తాయన్నారు. చేతులను శుభ్రంగా వుంచుకొంటే నులిపురుగులు పడే అవకాశం తక్కువ ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా గల పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాల్లోని 10037మంది విద్యార్థులకుగాను 9808మందికి మాత్రలను పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయప్రకాష్, ఆరోగ్య సూపర్ వైజర్ బాహుద్దీన్, ఎఎన్ఎం లత, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేణుగోపాల్‌రెడ్డిచే చదల్లా ఈద్గా ప్రహరీ పనులు ప్రారంభం

పుంగనూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త



కులమతాలకు అతీతమైన సమ సమాజం స్థాపించబడాలని మనుషులంతా ఒకే జాతిగా గుర్తించబడే రోజు ఎంతో దూరంలో లేదని జనసేన నియోజకవర్గ నాయకుడు ఎన్విఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన మండలంలోని చదళ్ళ గ్రామంలో ఈద్గా ప్రహరీ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలందరూ కుల మతాలు వేరైనా ఎంతో ఆప్యాయంగా బంధాలతో పిలుచుకుంటారని అన్నారు. మసీదు పెద్దలు మాట్లాడుతూ చెదలలోని మసీదుకు ఎటువంటి ఆదాయం లేని స్థితులలో వేణుగోపాల్ రెడ్డి మూడు గదులతో కూడిన వ్యాపార సముదాయాన్ని నిర్మించి ఇచ్చి, మసీదు ప్రగతికి తోడ్పడ్డారని తెలిపారు. ఆయనను మసీదు పెద్దలు సత్కరించారు. జనసేన నాయకులు శివ కుమార్ రెడ్డి, విరుపాక్షి, నారాయణరెడ్డి, సురేందర్ రెడ్డి, జివి రమణ, చైతన్య రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## మృత్యుంజయేశ్వరాలయంలో మాఘ సోమవారం పూజలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త



స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో మాఘ సోమవారాన్ని పురష్కరించుకొని విశేష పూజలు జరిగాయి. ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మమేష్‌ల అధ్వర్యంలో అభిషేక ప్రియుడు పరమశివుడికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్య లో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

## రైతు డిజిటల్ కార్డుల కోసం నమోదు చేయించండి : జ్యోతమ్మ

చౌడేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

డిజిటల్ కార్డుల కోసం రైతులు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి జ్యోతమ్మ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు రైతు యొక్క విశిష్ట గుర్తింపు సంఖ్య(డిజిటల్‌కార్డు)ను నమోదు చేయించుకోవాలన్నారు. సమీపంలోని రైతు సమాచార కేంద్రాలకు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబరును తీసుకెళ్ళి ఈనెల 28లోపు నమోదు చేయించుకోవాలన్నారు. డిజిటల్ కార్డు వల్ల పంటలభీమా, పిఎం కిసాన్‌యోజన, పంటనష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు వంటివి వర్తిస్తాయన్నారు.

## జల్లి ఫ్యాక్టరీ ఏర్పాటు వద్దని పోర్టల్‌లో ఫిర్యాదు

కుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త



మండలంలోని కృష్ణదాసనపల్లి పంచాయతీ వరమనూరు వద్ద ప్రైవేట్ జల్లి ఫ్యాక్టరీ ఏర్పాటుచేయకుండా చూడాలని కోరుతూ సోమవారం వరమనూరు గ్రామస్తులు కుప్పం తెదేపా కార్యాలయంలోని జన నాయకుడు పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలో జల్లి ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడతారని ఈ విషయ ంగా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రీవెన్స్ సెల్ సిబ్బంది గ్రామస్తుల ఫిర్యాదును స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 8,099 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

తవణంపల్లె, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని 8,099 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ సుధాకర్, తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ-1 హేమలత పిల్లలకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలను వేసి ప్రారంభించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు, అంగన్‌వాడి కేం ద్రాల్లోని 1 నుండి 19 ఏళ్ళు లోపు పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ రెడ్డిబాబు, ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, మండల వైద్య అధికారులు డాక్టర్ టి.ప్రియాంక, టిఎస్.మోహన్‌వేలు, వినయ్‌కుమార్, పి.కేశవనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కాణిపాకం పీహెచ్‌సీలో...

కాణిపాకం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు, అంగన్‌వాడి కేం ద్రాల్లోని 1 నుండి 19 ఏళ్ళు లోపు పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు నులిపురుగుల నివారణ గురించి హ్యాండ్ వాష్ గురించి అవగాహన కల్పించారు. కాణిపాకం, ముదిగోళం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వైద్యాధి కారులు డాక్టర్ ఎ.స్వాతి సింధూర, డాక్టర్ టి,రాజేశ్వరిల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వి.శివయ్య, పీహెచ్ఎన్ వేదవతి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో సమస్యలు పరిష్కారం: కమీషనర్

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కమీషనర్ నరసింహప్రసాద్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర ప్రజల నుండి తొమ్మిది సమస్యలపై అధికారులకు అర్జీలు అందాయి. ఈ క్యాక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎసిపి నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అలిప్ ద్వారా ప్రోత్సాహం

### - కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

కుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త



ఔత్సాహికులైన వారిని పారిశ్రామికవేత్తలుగా మలచేందుకు అలిప్ సంస్థ ద్వారా తగు ప్రోత్సాహం అందిస్తామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సోమవారం కడ కార్యాలయంలో ఎంపిక చేసిన యాభైమంది ఔత్సాహితులకు ఐదు రోజుల శిక్షణ తరగతు లను ప్రారంభించారు. పి.డి. మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో పరిశ్రమలను ప్రోత్సహిం చేందుకు కడ, డిఆర్‌డిఎ, మెప్మా, ఎపిఎస్‌ఎస్‌డిసిల సమన్వయంతో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామ న్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుచేయదలచుకున్న పారిశ్రామికవేత్తలకు అలిప్ సంస్థ సహకరిస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలుగా మారిన వారికి వారు ఏ తరహా పరిశ్రమ ఏర్పాటుచేస్తారు, పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన మెషినరీ, ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యం తదితరాలపై అలిప్ సంస్థ పారిశ్రామికవేత్తలకు తగు సహకారం అందిస్తుందన్నారు. పరిశ్రమ ఏర్పాటుదారులకు పరి శ్రమలపై అవగాహన కల్పించుటకు మున్ముందు హైదరాబాద్‌లో ఉన్న అలిప్ సంస్థ పారిశ్రామికవాడను సందర్శించే అవకాశ ం సైతం కల్పించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పంలో ప్రతి ఇంటినుంచి ఓ పారిశ్రామికవేత్తను రూపొందించాలనేది సిఎం ఆశయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, డా॥ వెంకటేష్, తెదేపా విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, మాజీ గంగమ్మ గుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, తెలుగు మహిళా నేతలు అనసూయ, భాగ్యలక్ష్మి త్రిలోక్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

కుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు పెన్షన్లు, ఇళ్ల మంజూరు, రెవెన్యూ సమస్యలపై వినతులు అందించారు. వీటిని ఆయా శాఖల ద్వారా పరిష్కరించాలని పిడి ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించి ప్రజలకు తగు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమాల్లో డిఇలు గురవారెడ్డి, పురుషోత్తం, సుబ్రమణ్యం, తహశీల్దార్ చిట్టిబాబు, ఎంపిడిఓ విజయ్‌దత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైకాపాతో లాలూచీ రాజకీయాలు సహించేది లేదు

### - ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త




వైకాపా నేతలతో తెదేపా శ్రేణులు ఎవరైనా లాలూచీ రాజకీయాలు చేస్తే సహించేది లేదని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కుప్పం మండల టిడిపి అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో కుప్పం మ ండల తెదేపా సర్వసభ్య సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా పాలనలో గతితప్పిన అభివృద్ధిని సిఎం చంద్రబాబునాయుడు మరలా గాడిన పెడుతున్నారన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు, రైతులకు గోకులం షెడ్లు తదితరాలు నిర్మిస్తున్నారన్నారు. నీటి సమస్య తలెత్తకుండా తాగునీటి బోర్లను వేయడం జరుగుతోందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సిఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. కుప్ప ం ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిఎం చంద్రబాబునాయుడు జననాయకుడు పోర్టల్‌ను తీసుకువచ్చారన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని నేతలకు సూచించారు. కుప్పంలో మంత్రి నారా లోకేష్ పర్యటన ఒకసారి నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే అర్హులకు కార్పోరేషన్ రుణాలు అందేలా పంచాయతీ సమన్వయ కమిటీ లబ్దిదారులను ఎంపిక చేసేలా తీర్మానించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. మాజీ ఎంపిపి సాంబశివం , కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, నేతలు రామచంద్ర, సంజీవి, మహేంద్ర, ఎవి రవి, మోహన్, చలపతి, విభూషణ్, వల్లెప్ప, వసంతమ్మ, బాలాజీ, రమేష్, సిఎం పిఎ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వెంకన్న ఆశీస్సుల్లో హైకోర్టు సిజె



తిరుమల, ఫిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:

రాష్ట్రహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందకున్నారు. సోమవారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణస్వాగతం పలికి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

కుప్పంరూరల్/శాంతిపురం/వి.కోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లో ఖాళీగా ఉన్న నాలుగు హెల్పర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓలు కృష్ణవేణి, కల్పన, అరుణశ్రీలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కుప్పం మండలం వేపూరు హెల్పర్ పోస్టుకు పదవ తరగతి పాసైన బిసిబి అభ్యర్థులు, సంగనపల్లి హెల్పర్ పోస్టుకు ఒసిలు దరఖాస్తు చేయాలన్నారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌కి ఆర్థిక సహాయం



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

అనారోగ్యంతో సిఎంసి వేలూరు నందు చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ కుమారుడు అజయ్ కుమార్‌కి ఐ ఆర్ ఫండ్ రూ.1,00,000ల చెక్కును జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజుఅందజేశారు. తిరుపతి జిల్లా, వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ అనారోగ్యంతో వేలూరు లోని సిఎంసి హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూతనిస్తూ ఐ.ఆర్.ఫండ్ రూ.1,00,000 రూపాయలను జిల్లా ఎస్పీ మంజూరు చేసి, సంబంధిత చెక్కును హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ కుమారుడు అజయ్ కుమార్‌కి జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏవో సురేష్ బాబు, ప్రకాష్ హెడ్ కానిస్టేబులు వారి సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుండి 95 ఫిర్యాదులు

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

సోమవారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు జిల్లా కార్యాలయం నందు ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని, నేరుగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించినారు. సదరు ఫిర్యాదులను సంబంధ పోలీస్ స్టేషన్‌కు పంపించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి కె.రవి మనోహరాచారి పరిపాలన, అదనపు ఎస్పీ నాగభూషణం క్రైమ్ వారు, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చును. ఆ ఫిర్యాదులను మీకోసం ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందన్నారు.

## రైతుల నిరసన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

### - మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

కుప ్పంరూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త




మండలంలోని ఆవులనత్తం గ్రామం వద్ద జల్లి ఫ్యాక్టరీనుంచి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొందరు రైతులు నిరసన తెలుపుతున్న విషయం విదితమే. సోమవారం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ నిరసన శిబిరం వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. తమది ప్రజా ప్రభుత్వం అని, రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకు ండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సలహాదారు నరేష్‌చారి, సంతోష్ పాల్గ ్నన్నారు.

## తిరుమల ప్రతిష్టత కాపాడేలా ప్రభుత్వం చర్యలు

### - తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి



శాంతిపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

తిరుమల ఆలయ ప్రతిష్టత కాపాడేలా ఎన్డీయే ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టిందన్నారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సిబిఐ విచారణ అధికారులు సోదాలు చేపట్టి తగు ఆధారాలు లభించడంతో నలుగురు నిందితులను అరెస్ట్ చేసిందన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వైకాపా ప్రభుత్వం వ్యవహరించదనే విషయం తద్వారా స్పష్టమైందన్నారు. వైకాపా పాలనలో 300కుపైగా ఆలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంససంఘటనలు జరిగాయన్నారు. వైకాపా ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసిందన్నారు.

# తిరుపతి డివిజన్

## వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



వడమాలపేట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: వ్యక్తి గత పరిశుభ్రత మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చునని వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చక్రపాణి తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని విద్యారులకు ఆల్బెడజోల్ మాత్రలను పంపిణీ చేశారు. సామాజిక ఆరోగ్య అధికారి పురుషోత్తంరెడ్డి, మంజుల, చంద్రమోహన్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం



బుచ్చినాయుడు కండ్రిగ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ఆరోగ్యమే మహాభాగ్యమని జీర్ణాశయం సక్రమంగా జరిగితేనే ఆరోగ్యం బాగుంటుందని నులి పురుగుల నిర్మూలన జరిగితేనే ఆరోగ్యం బాగుంటుందని వైద్య అధికారి దివాకర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారులు ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆరోగ్యమే మహాభాగ్యమని జీర్ణాశయం సక్రమంగా జరిగితేనే ఆరోగ్యం బాగుంటుందని, నులి పురుగుల సందర్భంగా మండలంలోని ప్రతి అంగన్‌వాడీ స్కూలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల జూనియర్ కళాశాలలో పంపించడం జరిగింది. ప్రతి ఆరు నెలలకు ఒక సారి ఈ టాబ్లెట్‌ని మింగడం ద్వారా మన కడుపులోని నులి పురుగులు, కుంకి పురుగులు, ఏలిక పాములు చనిపోవడం ద్వారా రక్తహీనత రాకుండా నిర్మూలించవచ్చన్నారు. వైద్యాధికారి దివాకర్, డాక్టర్ విద్యా సాగర్ ఆరోగ్య అధికారి డి.ఎస్.వెంకటేశ్వరులు, ఎంపీడీవో త్రివిక్రమరావు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు రవీంద్రనాథ్, సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య పాల్గొన్నారు.

## డిజిటల్ గుర్తింపు కోసం రైతులు రిజిస్టర్ చేయించుకోవాలి

సత్యవేడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: డిజిటల్ గుర్తింపు కార్డు కోసం మండలంలోని రైతులందరూ రిజిస్టర్ జాబితాలో వారి పేరును నమోదు చేయించుకోవాలని సత్యవేడు వ్యవసాయ మండల అధికారి మురళి కోరారు. సోమవారం స్థానిక ఆత్మ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ కార్డు మంజూరుపై వివరించారు. రైతులు వారికి సంబంధించిన రైతుసేవా కేంద్రాల వద్దకు వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కు అనుసంధానివంచిన మొబైల్ ఫోను తీసుకెళ్లాలన్నారు. ఫిబ్రవరి 28వ తేదీ లోపు మండల రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి వారి పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా పీఎం కిసాన్ యోజన సొమ్ము జమ కావాలంటే లబ్ధిదారులైన 3000 మంది రైతులు వెంటనే వారిపేర్లను రిజిస్టర్ చేయించుకోవాలని ఆయన కోరారు.

## బంకమట్టి తొలగిస్తే బతుకు జీవనం పోతుంది

### -ఇనగలూరు కుమ్మరి కుటుంబాల ఆవేదన



శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ఇనగలూరుకు చెందిన కుమ్మరి కుటుంబాలు గ్రామరెవెన్యూ అధికారి ప్రకటనతో తమ జీవితాలు పోతాయని జాయింట్ కలెక్టర్‌కు సోమవారం మొరపెట్టుకున్నట్లు వివరించారు. ఈ గ్రామంలో సుమారు 50కిపైగా కుమ్మరి కులస్థులు కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వారి బతుకు జీవనం కుండలు తయారు చేసుకోవటం వాటిని ఇటు వెంకటగిరి, అటు శ్రీకాళహస్తిలోని పలు గ్రామాల్లో విక్రయించు కుంటూ తమ జీవనాన్ని గడపటం జరుగుతుందని శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెజవాడ ఆదిశేషయ్య వివరించారు. సుమారు 40 సంవత్సరాల నుంచి గ్రామ సర్వే నెంబర్ 150/1మరియు2లోని ప్రభుత్వ భూమిలో బంకమట్టిని నిల్వ చేసుకొని కుండలు తయారు చేసుకుంటూ జీవనం గడుపుతున్నట్లు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. అయితే గ్రామ రెవెన్యూ అధికారి బంకమట్టిని ఈ సర్వే నెంబర్ల భూమి నుంచి తొలగించాలని లేదంటే జెసిబిలు ఏర్పాటు చేసి చదును చేస్తామంటూ హెచ్చరించటంతో ఆందోళన చెంది జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆదిశేషయ్యతో పాటు తిరుపతి జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వర్లు, సర్పంచ్ చెలికం నాగరాజు రెడ్డి చిల్లకూరు శివకృష్ణ, ముచ్చేలి బాలకృష్ణ, ముచ్చేలి శంకరయ్యలు ఉన్నారు.

## కాసరం పిహెచ్‌సిలో నులిపురుగుల దినోత్సవం



తొట్టంబేడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : మండలంలోని కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. మొదట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హాజరైన గ్రామస్థులకు అందించిన సిబ్బంది ఈ పిహెచ్‌సి పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాలు, ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ గుళికలను అందించారు. డాక్టర్ ఇ.మాధవుడు, డాక్టర్ ఎస్.తేజేశ్వరిల సారథ్యంలో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.

## సైబర్ నేరాల గురించి అప్రమత్తంగా ఉండాలి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : నేటి మాజంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహమూర్తి అన్నారు. సోమవారం శ్రీ విద్యాప్రకాశానంద ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బంది కల్గితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇక ఈ కళాశాల పరిసరాలు ఖాళీ ప్రదేశాలు ఇక్కడ మందుబాబులు మద్యం సేవించి ఆగడాలకు పాల్పడే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలి : రవీంద్రనాథ్



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం తిరుపతిలో రాష్ట్ర అధ్యక్షులు వై.రాజారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతోపాటు భవిష్యత్‌లో కార్మికులను అప్కాస్‌లో చేర్చి కనీస వేతనం రూ. 21వేలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అప్కాస్ రద్దును ప్రభుత్వం రద్దు ఆలోచన విరమించుకోవాలని, లేని పక్షంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా రాజ్యమేలుతారని దీంతో కార్మికుల హక్కులు హరించబడ తాయ న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్టా మహేంద్ర, దాసరి చంద్ర, హనుమయ్య, జి. శ్రీనివాసులు, సుశీలమ్మ, బుల్లెద్దుల అన్నమ్మ, శ్రీనివాసులు, పురుషోత్తం, జిల్లాల నుంచి వచ్చిన కార్మికులు, నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండ్‌జోల్

చంద్రగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండ్ జోల్ మాత్రలు వేసుకోవాలని ఎంపిడిఓ శేఖర్ అన్నారు. స్థానిక శ్రీ పద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మండల వైద్యాధికారి కుసుమ, డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది విద్యార్థినులకు ఆల్బెండ్ జోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్‌బాబు, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, వైద్య సిబ్బంది ఈశ్వరయ్య, వెంకటేశ్వరరావు, వాసు, శ్యామలలు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణలో పరిశుభ్రత కీలకం



పుత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది పిల్లలు పేరు నులి పురుగుల వల్ల బాధపడుతున్నారని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ వి.వీరయ్య అన్నారు. సోమవారం కాలేజీలో హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల దినోత్సవ నిర్వహణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల నివారించడంలో పరిశుభ్రత కీలకమని తెలిపారు. పండ్లు, కూరగాయలు తినే ముందు శుభ్రం చేసుకోవాలని, వీధి ఆహారాన్ని నివారించాలని, చేతులు, వంట గదులు, గోళ్లు ఎల్లపుడూ శుభ్రంగా వుంచుకుంటే నులి పురుగుల బాధ నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ జయప్రద, సభ్యులు డాక్టర్ షర్మిల, పద్మావతి, సావిత్రితో పాటు వైద్య, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీలో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం



రేణిగుంట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : రేణిగుంట విమానాశ్రయం వెళ్లే మార్గంలోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ హాస్పటల్ నందు సోమవారం ఆర్థోపెటిక్ వైద్యులు వెన్నుముక, వెన్నుపూసకు సంబంధించిన అరుదైన శస్త్ర చికిత్సను కీహోల్ ద్వారా విజయవంతంగా నిర్వహిం చారు. రాయలసీమలోనే ఇది తొలి శస్త్ర చికిత్స కావడం విశేషం. దేశమ్మ 63 అనే వృద్ధురాలు నడుము నొప్పి, కాలు నరం లాగడం బాధతో ఆసుపత్రి నందు చేరారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఎల్ 4, ఎల్ 5, ఎల్ 5ఎస్ 1 డిస్క్ నందు సమస్యలు ఉండడాన్ని గుర్తించారు. లామినెక్టమి, డిస్కెక్టమి శస్త్ర చికిత్స ద్వారా సాధారణ సర్జరీ కాకుండా కీహోల్ పద్ధతిలో చిన్న కోత, తక్కువ రక్తస్రావంతో ఎలాంటి వైద్య ఖర్చులు లేకుండా ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా విజయవంతంగా నిర్వహించారు. శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ మహేష్, డాక్టర్ సంతోష్, డాక్టర్ హర్ష, డాక్టర్ చక్రధర్ తదితర వైద్య బృందాన్ని ఆసుపత్రి జేఈవో డాక్టర్ నవీన్ కుమార్ రెడ్డి, హెచ్‌ఆర్ డాక్టర్ నాగరాజు, ఫెసిలిటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవ డాక్టర్ నరసింహ అభినందిం చారు. తనకు అరుదైన శాస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులకు దేశమ్మ ధన్యవాదాలు తెలిపారు. శ్రీబాలాజీ ఆసుపత్రి నందు అనేక రకాల శస్త్ర చికిత్సలు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేస్తున్నట్లు వైద్య బృందం తెలిపారు.

## ప్రవేశ పరీక్షలకు ఒత్తిడిలేని ప్రధాని చిట్కాలు



చంద్రగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ప్రవేశ పరీక్షలలో ఒత్తిడిలేకుండా ఏవిధంగా పరీక్షలు వ్రాయాలో భారత ప్రదాని నరేంద్ర మోడీ వివరించిన చిట్కాలను సోమవారం శ్రీపద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు వీక్షించారు. 2018 నుండి దేశ వ్యాప్తంగా గల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సంభాషించే "పరీక్ష పేచర్చ" వార్షిక కార్యక్రమాన్ని ప్రదాని నరేంద్ర మోడీ ఏటా నిర్వహిస్తున్నారు. బోర్డు పరీక్షలు, ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా, ఒత్తిడి లేకుండా ఏవిధంగా వ్రాయాలో ప్రదానికి వివరించారు. ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్ష ఏఎంఒ శివశంకరయ్య, ఏఎస్ఒ సారథి, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్‌బాబు, హెచ్ఎం వెంకటరమణారెడ్డి హాజరై విద్యార్థులతో కలసి వీక్షించారు.

## లోకేష్ కుటుంబానికి జనసేన అండగా వుంటుంది!



రామచంద్రాపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు రాయల చెరువులోపడి మృతి చెందిన లోకేష్ కుటుంబానికి జనసేన పార్టీ అండగా వుంటుందని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ అన్నారు. సోమవారం రాయలచెరువు పేటకు చేరుకుని మండల అధ్యక్షుడు సంజీవి హరితో కలసి లోకేష్ మృత దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడికి జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం వుందన్నారు. ఆయన కుటుంబానికి రూ.5 లక్షలు బీమా అందించి పార్టీ ఆదుకుంటుందన్నారు.

## అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : న్యాయశాస్త్రం అభ్యసించిన విద్యార్థులు పట్టుభద్రలంతా, సోషల్ ఇంజనీర్స్ అని సామాజిక భవిష్యత్తు అంతా వారి పైన ఆధారపడి ఉంటుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎక్స్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక మహతి కళాక్షేత్రంలో సోమవారం అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్ రెడ్డి, అనంత లా కాలేజీ చైర్మన్ అనంత రవి, ప్రిన్సిపాల్ సి.నటరాజారెడ్డి విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవృత్తి చాలా ఉత్తమమైనది అని, సామాజిక వ్యవస్థలో న్యాయ శాస్త్రం, న్యాయవాదుల ప్రాధాన్యతను ఆయన వివరించారు. చైర్మన్ అనంత రవి మాట్లాడుతూ కాలేజీలో గడిపిన రోజులు మనందరికి అనేక జ్ఞాపకాలను సవాల్లును విజయాలను మిగిల్చాయి అని, కేస్ లా స్టడీస్ మూడ్ పోర్ట్ పోటీలు ఇంటర్న్‌షిప్‌లు ఇవన్నీ మనను మంచి న్యాయవాదులుగా తీర్చిదిద్దాయి అని అన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంత ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ మరియు ప్రెసిడెంట్ జయ రామయ్య, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి బెస్ట్ రైడర్ ట్రోఫీ



తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఢిల్లీ వేదికగా గత నెల 28 వతేదీన రిపబ్లిక్ డే పెరేడ్ లో పాల్గొని గుర్రపు స్వారీలో ప్రతిభచూపిన తిరుపతి ఆర్ అండ్ వీ వింగ్ కు చెందిన ఎస్వీ ఆర్ట్ కళాశాల ఎన్.సి.సి.విద్యార్థి లోకేష్ ఆల్ ఇండియా బెస్ట్ రైడర్ ట్రోఫీ సాధించాడు. దీంతో పాటు డ్రస్సాజ్ పోటీలలో బంగారు పథకం, టెంట్ పెగ్గింగ్ పోటీలలో రజత పథకం సాధించాడు. అలాగే అదే కళాశాలకు చెందిన మరో ఎన్సీసీ విద్యార్థి మహిమరాజు డ్రస్సాజ్ పోటీలలో రజిత, బ్రౌంజ్ మెడల్‌ను సాధించారు. వీరితో పాటు ఆర్మీవింగ్‌కు చెందిన రమేష్ రిపబ్లిక్డే పెరేడ్లో పాల్గొని ప్రతిభచూపాడు. ఈ సందర్భంగా పెరేడ్లో ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాలరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరుడు, ఎన్సీసీ అధికారులు పురుషోత్తం, రమేష్, ఉమామహేశ్వరి, అధ్యాపకులు భీమన్న, రామకృష్ణారెడ్డి అభినందించారు.

## ఉచిత మెగా మెడికల్ క్యాంపుకు విశేష స్పందన



నింద్ర, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : సోమవారం మండలంలోని మేళంబాకం గ్రామంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా భూపతి రాజు పండేటి వారి సహకారంతో పుత్తూరు పట్టణం ఉషోదయ వాకర్స్ అసోసేషన్ ప్రోత్సహంతో క్యాంపు నిర్వహించడం జరిగింది. మేళంబాకం, యంయస్‌వియం పురం, తిప్పాపురం, ఆరూరు, ఒబిఆర్ కండ్రిగ నుంచి ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. వారిలో ఎముకలు హార్ట్ పరీక్షలు, 325 మందికి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేసారు. పైన కనబరిచిన గ్రామాలను దత్తత తీసుకొవడానికి వాకర్స్ అసోసేషన్ అధ్యక్షులు బి.బాబు, కార్యదర్శి హెచ్ రామ్మోహన్‌వర్మ, ట్రెసరర్ ఆర్ రమేష్‌రాజు, ఈక్యాంపుకి ముఖ్య అతిధులు చమర్తి శోభారాజు చెన్నై, డాక్టర్ రవిరాజు రిటైర్డు మెడికల్ ఆఫీసర్, గ్రామ సర్పంచ్ బాలక్రిష్ణమరాజు, యంఇఓ ప్రభాకర్‌రాజు, వీరితో పాటు గ్రామ పెద్దలు నాగభూషణంరాజు, మోహన్‌రాజు, లక్ష్మిపతిరాజు, సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పట్టాల కోసం ధర్నా



బుచ్చినాయుడు కండ్రిగ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: నిరుపేదలైన అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి ఇంటి పట్టాలు, గృహ నిర్మాణ సౌకర్యం కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు చిన్నిరాజా, కత్తి ధర్మయ్యలు మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామ పంచాయతీల్లో నివాస యోగ్యమైన స్థలాలను గుర్తించి ఇంటి స్థలాల కోసం భూములను గుర్తించి అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి స్థలం కేటాయించి మంజూరు చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పాలకుల స్వార్థ రాజకీయాల కోసం నిరుపేదలను బలి చేయవద్దని తెలియజేశారు. మండలంలో పేదలను గుర్తించి నివాసయోగ్యమైన స్థలాల్లో ఇంటి పట్టాలను మంజూరు చేసి అందజేయాలని కోరారు.

## వేదిక్ వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా భాస్కరుడు



తిరుపతి విద్య ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఎస్వీ వేదిక్ వర్సిటీ నూతన రిజిస్ట్రార్గా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల గణితశాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరుడు నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రిజిస్ట్రార్‌గా నియమించిన టీటీడీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. ఎస్వీఆర్ట్స్ కళాశాలఅధ్యాపకులు ఆయనను అభినందించారు.

## అంతర్జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఎస్వీయూ రాజనీతి శాస్త్రము, ప్రజా పరిపాలన భాగం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 16వ వరకు మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, ఆచార్యులు వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

## పేదలకు ఇంటిస్థలాలు కేటాయించాని : సిపిఐ

తిరుపతిరూరల్, ఫిబ్రవరి10 ప్రభాతవార్త: ఇళ్లలేని నిరుపేదలకు ఇంటిస్థలాలు కేటాయించాలని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సిపిఐ నాయకులు రామానాయుడు డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం తిరుపతిరూరల్ తహశీల్దార్ ముందు పేదలతో కలిసి సిపిఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు మాట్లాడుతూ ఇళ్ల లేని లబ్దిదారులలో దాదాపు 90శాతం మంది వెనకబడిన ప్రజలే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేసారు. గత ప్రభుత్వంలో పేదోళ్ళకు ఇంటిస్థలం కేటాయించిన, అవి ఇళ్ల నిర్మించుకోవటానికి అనుకూలంగా లేవన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యధర్శి విశ్వనాధ్, కార్యవర్గ సభ్యులు ఎన్‌డి రవి, పద్మనాభరెడ్డి, శివ, శ్రీరాములు, రత్నమ్మ, వై.రాజ, రామకృష్ణ, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యత ఎస్వీయుకి

తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాలకు కేటాయించిన ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను భాగంగా ఎస్వీ యూనివర్సిటీకి కేటాయించిన ఏపీ పీజీ సెట్ 2025, ఏపీ రీసెట్ 2025 ప్రవేశ పరీక్షల యొక్క కన్వీనర్ నియామక పత్రాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుల చేతుల మీదుగా సోమవారం ఆచార్య పిసి వెంకటేశ్వర్లు అందుకున్నారు.

## సి.సి.రోడ్లు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



తిరుపతిరూరల్, ఫిబ్రవరి10 ప్రభాతవార్త: సి.సి.రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తిరుపతి రూరల్ ఎంపిడిఓ రామచంద్ర, పంచాయతీ రాజ్ ఏఇ రాజమస్తానయ్య సూచించారు. తిరుపతిరూరల్ పేరూరు గ్రామ పంచాయతీ పరిధిలో జనార్ధన్ కాలనీ ఓవర్ హెడ్ ట్యాంకు నుండి చెంచువారికి కాలనీ వరకు సి.సి.రోడ్డు నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాగూరు శ్రీనివాసులు, కాయం వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు చెంచువారికాలనీకి దారిలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో పేదల కల నేరవేర్చామని తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.20లక్షల రుపాయాల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దామినేటి నాగరాజు, మహేష్, చిన్ని, నటరాజ్, లక్ష్మీప్రసన్న, జ్ఞానేశ్వర్‌రెడ్డి, ముంతాజ్‌లు పాల్గొన్నారు.

## ఈ నెల 12తేదీ నుంచి శ్రీ కావమ్మ తిరుణాళ్లు

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం, కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కావమ్మ మారయ్య తిరుణాళ్లు 12 తేదీ నుంచి 15 తేదీ వరకు నిర్వహించనున్నట్లు, శ్రీ కావమ్మ మారయ్య బెస్త సేవా సంఘం వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తిరుణాళ్ళకు ముఖ్య అతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరవుతున్నట్లు వివరించారు. ఇందు కోసం ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

## రైతులకు ఎరువులు పంపిణీ : ఎమ్మెల్యే



పుత్తూరురూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: పుత్తూరు మండలంలోని నేసనూరు గ్రామ పంచాయతీలో ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు కావలసినటువంటి ఎరువులను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతు అభివృద్ధి కోసం తోడ్పడే పార్టీ అని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ గంజిమాధవయ్య, వ్యవసాయ సంచాలకులు ఆర్.రమేష్, వ్యవసాయాధికారి ఎస్.కోదండయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో కొనసాగుతున్న పింఛన్ల తనిఖీ



సత్యవేడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో సామాజిక భద్రత పింఛన్ల తనిఖీ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రతిభావంతుల పింఛన్లను వైద్యులు పరిశీలించారు. స్థానిక ఎంపీడీవో చంద్ర శేఖర్, వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సురేష్ పర్యవేక్షణలో పింఛన్ల తనిఖీ జరుగుతోంది. ఈ నేపథ్యంలో చంద్రగిరి కమ్యూనిటీ వైద్యశాల ఆర్థోపెడిషన్ డాక్టర్ పవన్ పింఛన్ల తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ గోవర్ధన్, వెల్ఫేర్ అసిస్టెంట్ ముత్యాలయ్య, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటేశ్వర్ తదితరులు ఉన్నారు.

## రహదారి సూత్రాలు పాటించండి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : విద్యార్థి దశ నుంచే రహదారి సూత్రాలపై అవగాహన ఉండాలని, సూత్రాలను పాటించి రక్షిత వ్యవస్థకు సహకరించాలని శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ పిలుపు నిచ్చారు. సోమవారం ద స్కూల్‌లో ఆమె ఆర్‌టిసి భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ద స్కూల్ కరస్పాండెంట్ జనార్థన్‌రావు పవార్ అధ్యక్షత వహించగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి చిట్టెమ్మ మాట్లాడుతూ, నేడు వాహనాల సంఖ్య పెరుగుతుందని, వాహనాలు నడిపే సమయంలో రహదారి సూత్రాలను పాటించాల్సి ఉందన్నారు. వాహనాలను నడిపే సమయంలో మద్యం సేవించటం, అతి వేగం, ఓవర్‌లోడ్ అనేది ప్రమాదకరమని గుర్తించాలన్నారు. వాటిని గుర్తించినపుడు మనం సురక్షిత జీవితాన్ని గడపవచ్చునని వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు కరస్పాండెంట్ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్టీసీ సూపరిన్‌టెండెంట్ మారయ్య, ది స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో మృతి చెందినది బిరదవాడ వాసి

తొట్టంబేడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నాయుడుపేట మార్గంలోని పెద్ద కన్నలి సమీపంలో పెట్రోల్‌బంకు వద్ద మృతి చెందిన యువకుడు ఎవరో టూటౌన్ పోలీసులు గుర్తించారు. ఆతను నాయుడుపేట మండలం బిరదవాడ గ్రామానికి చెందిన మునిశేఖర్‌నాయుడు (30) అని గుర్తించారు. మునిశేఖర్ ఎయిర్‌టెల్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నట్లు సమాచారం సేవకరించారు. మునిశేఖర్ ఆదివారం తిరుపతిలో వ్యక్తిగత పని నిమిత్తం వెళ్ళి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు వివరించారు. సమాచారం అందుకున్న గ్రామానికి చెందిన గంగబాబు ఆతను మునిశేఖర్ అని గుర్తించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమారస్టం జరిపి శవాన్ని బంధువులకు అప్పగించినట్లు టూటౌన్ పోలీసు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## గ్రీవెన్స్‌డేలో సమస్య గోల

తొట్టంబేడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : తొట్టంబేడు మండల కేంద్రంలో సోమవారం గ్రీవెన్స్ దే సందర్భంగా అధికారులకు గ్రామీణ ప్రాంత ప్రజలు సమస్యల గోలను విన్నవించుకున్నారు. సోమవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాలి మురళీనాయుడు హాజరై జనం సమస్యను ఇటు రెవెన్యూ అధికారి మధుసూధన్, అటు ఎంపిడిఓ సురేంద్రనాథ్‌లకు వివరించారు. ప్రభుత్వం వాట్సప్ గవర్నస్‌కు సంబందించి ప్రకటించిందని ఎవరైనా సరే రేషన్ కార్డుల్లో పేర్లు మార్పులు, చేర్పులు, మరణ ధృవ పత్రాలు, కులధృవీకరణ పత్రాలు వాట్సాప్ ద్వారా తీసుకోవచ్చునని ప్రకటించి ఉన్నారని ఈ విధానాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రతి సర్టిఫికేట్‌కు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు అవసరం లేదని చైతన్యవంతుల్ని చేసారు.

## రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు



వడమాలపేట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: రైతులు డిజిటల్ గుర్తింపు కార్డులు నమోదు చేసుకోవాలని వడమాలపేట వ్యవసాయశాఖ అధికారి విజయకుమార్ తెలిపారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య(కార్డు) ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు వివరాలు నమోదు చేయడం జరుగుతుందని, రైతులందరూ సహకరించి వారి వివరాలను తెలియజేసి ప్రత్యేక రైతు గుర్తింపు కార్డును తీసుకోవాలని కోరారు. కావున రైతులందరూ తప్పని సరిగా ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందుటకు వారి గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రంలో సంప్రదించి నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# గోవర్ధన్‌రెడ్డి నిజం తెలుసుకొని మాట్లాడాలి

**- గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



గూడూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : గోవర్ధన్‌రెడ్డి నిజం తెలుసు కొని మాట్లాడాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు టీడీపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియా సమావేశం నిర్వహిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను ఎప్పుడూ కక్షపూరిత రాజకీయం చేయలేదు. ఎన్నికలు జరిగే రోజు నుండి ఇప్పటివరకు వైసీపీ వాళ్ళే రౌడీ రాజకీయం చేస్తున్నారు. ఎలక్షన్ రోజు చిల్లకూరులో జరిగిన గొడవలు దగ్గరనుండి అన్నీ గొడవలకు కారణం ఎవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసునని ఎద్దేవా చేశారు. ఎన్నికలు జరిగి టీడీపీ జనసేన బీజేపీ కూటమి ప్రభుత్వం గెలిచిన రోజునుండి ఎన్నోసార్లు టీడీపీ ఫ్లెక్సీలు వైసీపీ ఆకతాయిలు చించినా, నేను మా పార్టీ నాయకులు పిలిచి మాట్లాడాం, కానీ అక్రమ కేసులు వారిపై పెట్టలేదు. గూడూరు నియోజకవర్గంలో నలుగురు ఎస్సైలు మీ ప్రభుత్వం నుండే పని చేస్తున్నారు. మీరు ఆరోజు వాళ్లకి పోస్టింగ్ ఇచ్చింది మీ గవర్నమెంట్ ఉన్నప్పుడే, కాబట్టి అది తెలుసుకుని నిజానిజాలు మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంలో మంజూరు చేసిన రోడ్డు పనులకు కూడా మీ నాయకుల పేరు పెట్టమ నడం, లేకపోతే పనిచేయనీయకపోవడం ఎంత దారుణమో ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. వైసీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి ఆయన నియోజక వర్గంలో చేసిన అక్రమాలు ఎన్నో ఉన్నాయి. మీ గురించి మీరు చేసిన అక్రమాల గురించి మాట్లాడాలంటే చాలా ఉంది. మాది ప్రజా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవాలు తీసుకుని ప్రజల్లోకి రండి మేము వస్తాం న్యాయం కోసం పనిచేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వరరాజు, చల్లపల్లి భాస్కర్‌రెడ్డి, మట్టం శ్రావణి, వాటంబేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ : డిఎస్పీ



నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : నేరాల నియంత్రణకే పోలీసు శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని నాయుడుపేట డిఎస్పీ చెంచు బాబు అన్నారు. సోమవారం ఉదయం నాయుడుపేట మండలం శ్రీనివాసపురం గిరిజన కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బయటి ప్రాంతాల వారు శ్రీనివాస పురం ప్రాంతంలో నివసిస్తున్నట్లు సమాచారం రావడంతో కార్డన్‌సెర్చ్ నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే వాహనాలను నడిపే వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట అర్బన్ సీఐ బాబీ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## శాంతిభద్రతలకు విగాతం కలిగిస్తే కఠిన చర్యలు:డిఎస్‌పి

నాయుడుపేట,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త; గ్రామాల్లో ఎవరైన శాంతిభద్రతలకు విగాతం కలిగిస్తే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు తెలిపారు.సోమవారం ఆయన ఆధ్వర్యంలో నాయుడుపేట మండలంలోని శ్రీనివాసపురంలో పోలీసులు కార్డేన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి క్షుణంగా వాహనాలు,వాటికి సంబందించిన పత్రాలను పరిశీలించారు. డిఎస్పీ చెంచుబాబు మాట్లడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేదించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎవరైన అనుమానాస్పదంగా కొత్తవ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచ్చారం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా యువత మత్తుపదార్ధాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట నాయుడు పేట సిఐ బాబి,ఎస్సైలు అజయ్‌కుమార్, నాగరాజు, ఆదిలక్ష్మి, స్వప్న, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## తమిళ సరిహద్దుల్లో రోడ్డు ప్రమాదం : ఒకరు మృతి



తడ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలం పెదపన్నంగాడు వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన బంగారు సారంగన్ (55) అనే వ్యక్తి మృతిచెందాడు. తమిళనాడు లోని గుమ్మిడిపూండి సమీపంలో ఉన్న సామిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన సారంగన్ పన్నంగాడు వద్ద కూలీ పనికి వచ్చి రోడ్డు మార్జిన్‌లోనే నడుస్తుండగా, నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న వాహనం ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలైన సారంగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. ఈ మేరకు సారంగన్ కుమారుడు జగన్ తడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కొండప్పనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్యం కోసం నులిపురుగు నివారణ మందులు వాడాలి



బాలాయపల్లి. ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : చిన్నారుల ఆరోగ్యం కోసం డి వార్మి టాబ్లెట్స్ తప్పనిసరిగా వాడాలని సిడిపిఒ శంషాద్ బేగం తెలిపారు. వెంగమాంబపురం, బాలాయపల్లి అంగన్వాడి కేంద్రాల్లో, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డివార్మింగ్ డే సందర్బంగా చిన్నారులకు, విద్యార్థిని, విద్యార్థులకు డి వార్మింగ్ టాబ్లెట్లు మింగించిన వైద్యాధికారిణి ప్రమీల, ఐసిడిఎస్ అధికారిని శంషాద్ బేగం, ఏఎన్ఎంలు, ఎంఎల్‌సి రత్నమ్మ పాల్గొన్న ఉపాధ్యాయులు జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలో 5100 విద్యార్థిని, విద్యార్థులకు ఆల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేస్తామని వైద్యాధికారిణి ప్రమీల తెలిపారు. రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల లోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణి చేశారు.

## లైంగిక దాడులు పాల్పడే వారిపై కఠిన చర్యలు



బాలాయపల్లి. ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : లైంగిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై కామినేని గోపి తెలిపారు.వెంగమాంబపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు లైంగిక దాడులపై అవగాహన కల్పించి పలు సూచనలు చేసిన ఎస్సై కామినేని గోపి, పాల్గొన్న హెచ్ఎం సుమతి, ఉపాధ్యాయులు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు హెల్మట్ ధరించాలని తెలిపారు.

## నులిపురుగు మందులు పంపిణీ చేసిన రాజేష్



వెంకటగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: పట్టణం రాజా వీధిలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల నందు ప్రిన్సిపాల్ ఆలూరు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాతకోట పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజేష్ మరియు హెల్త్ సెక్రటరీ సత్తివేణి పాల్గొన్నారు. పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఆల్బెండజోల్ మాత్ర ఆహారము తీసుకున్న తరువాతనే ఇవ్వాలని సూచించారు. ఖాళీ కడుపుతో ఉన్నవారికి ఇవ్వకూడదనీ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ డీన్ చంద్రశేఖర్, ప్రైమరీ ఇంచార్జ్ దివ్య, ప్రీప్రైమరీ ఇంచార్జ్ శ్రీలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలకు నులి పురుగులు మాత్రలు పంపిణీ



వాకాడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : వాకాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని ఎంపీడీఓ అన్నపూర్ణారావు విద్యార్థులకు నులిపురుగులు మాత్రలు అందించారు. సోమ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాఠశాలలోనే విద్యార్థులతో కలిసి జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకొని, ఆరోగ్యపరంగా శుభ్రంగా ఉండాలన్న అని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామానుజాచార్యులు, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆధార్, 1బి, మొబైల్ లింక్ చేసుకోవాలి

వాకాడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాల ఆదేశాల మేరకు రైతులు గుర్తింపు కార్డు కోసం రైతు భరోసా కేంద్రాలలో ఆధార్, 1బి, మొబైల్ లింక్ చేసుకోవాలని అగ్రికల్చర్ అధికారిని దీప తెలిపారు. సోమవారం దీప ప్రకటన ద్వారా తెలియజేస్తూ ప్రభుత్వ సబ్సిడీలు రైతులు పొందాలంటే తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో ఐడెంటి సంఖ్య కార్డు కోసం ఆధారు, మొబైల్ నెంబర్, పట్టాదారు పాస్ పుస్తకం, లేకపోతే వన్ బి, ప్రతి ఒక ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, వ్యవసాయ సబ్సిడీలు, పంట నష్టం వీటన్నిటికీ గుర్తింపు సంఖ్య కార్డు వస్తుందని ఏవో సూచించారు.

## కోటలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

కోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని కోట మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం వైద్యులు నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నులి పురుగులతో కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, బరుగు తగ్గడం, కడుపు ఉబ్బరం, చర్మంపై దద్దుర్లు, న్యూమోనియా, రక్తహీనత, ఆయాసం, నిస్సత్తువ వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు.

## మహాశివరాత్రికి ప్రభుత్వ ప్రతినిధులకు ఆహ్వానాలు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వంలోని పలువురు ప్రముఖులకు సోమ వారం శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సారధ్యంలో ఇఒ టి.బాపిరెడ్డి ఆలయాధికారులు, వేదపండితులు, సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికారు. విజయవాడలోని పలువురు మంత్రు లు, చైర్మెన్లకు ఆహ్వాన పత్రికలను అందించారు. కింజారపు అచ్చెమనాయుడు, మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, సత్యకుమార్ యాదవ్, చీఫ్ విప్ వయ్యావుల కేశవ్,ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్, ప్రభుత్వ రెవెన్యూ కార్యదర్శి ప్రద్యుమ్నలకు ఆహ్వాన పత్రికలను అందించారు. డెప్యూటీ ఇఒ ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, వేదపండితులు శివప్రసాద్‌శర్మ, ప్రభాకర్‌శర్మ, అవినాష్ శర్మ,ఎఇఒ హేమామాలిని తదితరులున్నారు.

## పక్కాగా సమస్యలు పరిష్కారం : కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారు లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీల పరిష్కారంకు అధికారులు ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు.సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 253 అర్జీలు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 145 అర్జీలు అందాయి.

## ఇటు ఆటోలు... అటు ఆర్‌టిసి బస్సులు

**-ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయలేని పోలీసులు**

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు, యాత్రికులు, ప్రయాణీకులు ట్రాఫిక్ చిత్తడిలో సతమతమౌతున్నారు. కనీస ట్రాఫిక్ పరిజ్ఞానం లేని ఆటో డ్రైవర్లు అడ్డదిడ్డంగా నడుపుతుంటే, అదుపులేని ఆర్‌టిసి వారు నడివీధిలో చేయి చూపిన నోటల్లా ఆపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నారు. మరో వైపు దేవస్థానం తరపున సన్నిధివీదిలో రోడ్డు పనులు, డివైడర్లు, మరమ్మతులు, శివరాత్రి ఏర్పాట్లు జరుగుతుంటే ఈ మార్గంలో ఆర్‌టిసి బస్సుల పయనంతో గంటల కొద్ది ట్రాఫిక్ స్థంభించిపోతుంది. అయితే కంట్రోల్ చేయాల్సిన పోలీసులు ఎందుకో ఆమలు చేయలేకపోతున్నారు. ముఖ్యంగా నాలుగు మాడావీధుల్లోని బజారు వీధిలోని గాలిగోపురం వద్ద సమస్య జటిలంగా' మారింది.

**బిక్షాల గాలిగోపురం,బేరివారి మండపం వద్ద :**



శ్రీకాళహస్తిలోని బిక్షాల గాలిగోపురం వద్ద నిత్యం రద్దీ ఉంటుంది. ఇక్కడ గతంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తేరువీధిలోని రథం ఎదురుగా వాహనాల మండపం వద్ద ఆర్‌టిసి బస్సులను నిలపాలని నిర్ణయించారు. ప్రయాణీకుల సౌకర్యార్థం షెల్టర్‌ను కూడా నిర్మించారు. అయితే ఆర్‌టిసి బస్సులను ఎందుకో డ్రైవర్లు బిక్షాల గాలిగోపురం మలుపు వద్దనే నిలిపి ప్రయాణీకులను లోడ్ చేసుకోవాలని నిలుపుతు న్నారు. ఒక బస్సు నిలిస్తే వెనుక బేరివారి మండపం వద్ద నిముషాల్లో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇక అవగాహన లేని ఆటోల డ్రైవర్లు ఎదురుగా రావటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. దీనికి తోడు ఈ సమీపంలో ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వాహనాలు అడ్డదిడ్డంగా ఉండటం తో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. అయితే అదుపు చేయాల్సిన పోలీసులు,ఆర్‌టిసి అధికారులు ఎందుకో పట్టించుకోవటం లేదు. జలవినాయక ఆలయం మార్గంలో గూడూరు,సూళూరు పేట డిపోల ఆర్‌టిసి బస్సులు నిబంధనలకు వ్యతిరేకంగా పరుగులు తీస్తున్నాయి. మరి ఆర్‌టిసి బస్సులు ఈ మార్గంలో వెళుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తుంటే పోలీసు అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

## హాస్టల్ సిబ్బందితోనే సమస్యలు

**-వర్సిటీ అధికారులకు విద్యార్థుల ఫిర్యాదు**

**-విద్యార్థిపై దాడి ఘటనపై ఎస్పీకీ ఫిర్యాదు చేసిన వీసీ, రిజిస్ట్రార్**



తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్తలు : ఎస్వీయూలో శనివారం అర్థరాత్రి విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ ఉదంతంపై వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు సోమవారం విచారణ చేపట్టారు.ఘటన జరిగిన హెచ్ బ్లాక్ హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులను, హాస్టల్ సిబ్బందిని విచారిం చారు. అనంతరం కత్తిపోట్లకు గురై గాయపడిన విద్యార్థులను వారు పరామర్శించి ప్రిన్సిపాల్, వార్డన్, డీన్ ఆధ్వర్యంలో విచారణకు ప్రత్యేక కమిటీని నియ మించారు. అనంతరం ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు.అనంతరం వీసీ మాట్లాడుతూ హెచ్ బ్లాక్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమని,బయట వ్యక్తులు, మాజీ విద్యార్థులు హాస్టల్స్‌లో తిష్టవేసినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. వెంటనే త్రిసభ్య కమిటీని నియమించి విచారణకు ఆదేశించామన్నారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని,బయట వ్యక్తులు హాస్టల్స్‌లో ఉన్నా, వారికి ఆశ్రయమిచ్చేందుకు సహకరించి వారిపై కఠిన చర్యలు తీసుకుని,పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ వార్డెన్ ఆచార్య నారాయణ, అకడమిక్ కన్సల్టెంట్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ప్రజల నుండి వచ్చే వినతుల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా పిర్యాదుల పరిష్కా ర వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 12 మంది, మరో 47 మంది వినతులు ద్వారా సమస్యలను విన్నవించారని అదనపు కమిషనర్ తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ట్యాక్సీ స్టాండ్ వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం వలన అదే జీవనంగా గడుపుతున్న ట్యాక్సీవాలాలకు ఇబ్బంది అవుతుందని పునఃపరిశీలించాలని కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రలు కోరారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి, డి.ఈ.లు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధాని



చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తుం డటంతో పరీక్షలంటే విద్యార్థుల్లో భయం పోగొట్టడానికి ప్రధాని నరేంద్రమోడి సోమవారం విద్యార్థులతో పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. న్యూఢిల్లీ నుండి ప్రధాని నరేంద్రమోడి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులతో ఈ పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించగా జిల్లాలోని పాఠశాలల నుండి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోడి ప్రతి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కావడానికి విద్యాసంవత్సరం ముగింపు సమయంలో విద్యార్థుల్లో పరీక్షలపై వున్న భయం, ఆందోళనను పోగొట్టడానికి పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడి విద్యార్థులతో ముచ్చటిస్తూ పరీక్షల విషయంలో వారికి అవసరమైన సలహాలు సూచనలు ఇస్తుంటారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో 59,601 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారి వెంకటరమణ పర్యవేక్షించారు.

# గూడూరు డివిజన్

## కోట పట్టణంలో కోటి రూపాయలతో రోడ్డు పనులు

**- జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్**



కోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : కోట పట్టణంలో రెండు రోడ్లు నిర్మాణానికి కోటి రూపాయల నిధులను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మంజూరు చేసినట్లు తిరుపతి పార్లమెంటు మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ తెలిపారు. ఆ మేరకు సోమవారం సాయంత్రం కోట పట్టణంలోని పలు రోడ్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట పట్టణ పరిధిలోని ఆర్టీసీ-క్రాస్‌రోడ్డుకు అనుబంధంగా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల మీదుగా కోట-వెంకన్నపాలెం రోడ్డు నిర్మాణానికి, ఆర్టీసీ నుంచి క్రాస్‌రోడ్డుకు అనుబంధంగా గోపాల్‌రెడ్డి విగ్రహం సమీపంలో కల్యాణ మండపం మీదుగా సామాజిక ఆరోగ్య కేంద్రం వరకు బిటి రోడ్డు, సిసి రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో కోట పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు జలీల్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తి గత శుభ్రత పాటించాలి

**-ఎస్.కె.ఆర్ డిగ్రీ కళశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివ ప్రసాద్**



గూడూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: స్థానిక ఎస్.కే.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో 10వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత విద్యార్థులు నులిపురుగుల పట్ల అవగాహన కలిగి తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచనలు ఇచ్చి మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ మాత్రలు వేసుకుని తర్వాత నులిపురుగుల పట్ల నిర్లక్ష్య భావము తగదని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఇవి ప్రతి ఆరు నెలలకు ఒకసారి వారివారి మంచినీటి సదుపాయాన్ని దృష్టిలో ఉంచుకొని మాత్రలు వేసుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పీర కుమార్, అధ్యాపకులు శ్రీధర్ శర్మ, డాక్టర్ కోటేశ్వరరావు, కిరణమై, ఎన్సిసి ప్రోగ్రాం ఆఫీసర్ మైమూన్, శైలజ, డాక్టర్ యూన్సీ వాణి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సి. నారాయణరాజు, లక్ష్మి, కృపా కరుణ వాణి, ఇతర అధ్యాపక ఆధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నారాయణ విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం



గూడూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానం ఆవరణలో జిల్లాలోని నారాయణ పాఠశాలల విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పాసిం సునీల్ కుమార్ జాతీయ, క్రీడా జెండాలను ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా మార్చ్ ఫాస్ట్, రాకెట్ నమోనా ప్రయోగం, సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే పాసిం కుమార్ మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో చదువుకున్న ప్రతి విద్యార్థి ఉన్న స్థాయిలో ఉన్నారని, చదువుతోపాటు క్రీడలు కూడా చాలా అవసరమని, ప్రతి ఒక్కరు చదువుకొని అభివృద్ధి చెందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ సంస్థల జీఎం విజయభాస్కర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దత్తాత్రేయ, అడ్మినిస్ట్రేటివ్ ఇంచార్జ్ విశ్వక్, క్లస్టర్ ప్రిన్సిపల్స్ రియాజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సౌకర్యవంతంగా బస్సులు నడపాలి

**- ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్‌కి వినతి**



కోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : గూడూరు నియోజకవర్గంలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉండేవిధంగా వాకాడు ఆర్టీసీ డిపో నుంచి బస్సులు నడపాలని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వర రావు ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డిని కోరారు. ఆ మేరకు సోమవారం ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశా నట్లు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు గూడూరు నుంచి విజయవాడ, చెన్నై ప్రాంతాలకు వెళ్లేందుకు ఉదయం సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో కూడా అదే రైలు గూడూరుకి వస్తుందని తెలిపారు. అయితే ఆ సమయంలో రైల్వేస్టేషన్ నుంచి బస్సులు లేకపోవడంతో వ్యయ ప్రయాసలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో అల్లంపాడు బస్సు గూడూరు పాతబస్టాండు వరకు సౌకర్యంగా ఉండేదని తెలిపారు. వాకాడు డిపో బస్సులను ఉదయం 5.30 గంటలకు, రాత్రి తిరిగి 11 గంటలకు గూడూరు రైల్వేస్టేషన్ నుంచి వాకాడుకు నడపాలని కోరినట్లు తెలిపారు. ఆ మేరకు సురేష్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట జిల్లా కోర్ కమిటీ సభ్యులు దువ్వూరు గిరిధర్‌రెడ్డి ఉన్నారు.

## క్రీడాకారులకు అభినందనలు



కోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి క్రీడాకారులు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఒంగోలులో జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచారని ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం కళాశాలలో విజేతలైన క్రీడాకారులను డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి అభినందించారు. జాతీయ స్థాయిలో జరిగిన బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో ప్రథమస్థానం, చెస్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలను వివిధ విభాగాధిపతులు అభినందిం చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పీడీలు రామ్‌కుమార్, శోభారాణి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## నీటిని విడుదల చేసి పంటలు కాపాడండి

కోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : కోట మండలం కేశవరం గ్రామ రైతుల పంటలు చివరి దశలో ఉన్నాయని, తెలుగుగంగ అధికారులు స్పందించి తెలుగుగంగ జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. సోమవారం ఆ గ్రామస్థులు మాట్లాడుతూ పుల్లంబట్ల చెరువు, కేశవరం పెద్ద చెరువు కింద వరి సాగు చేస్తున్న రైతులకు నీటి ఎద్దడి ఏర్పడి పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. అంతేకాకుండా ఆ చెరువుల కింద పుచ్చ, మిరప, కూరగాయలు పండించే రైతులకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ కాలువకు తెలుగుగంగ నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరారు.

## రైతులకు ఎరువులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పుత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు సీజన్‌కు ముందుగానే పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. రూరల్ మండలంలోని నేసనూరులో సోమవారం ఆయన రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేస్తున్న ఎరువులు రైతుల అవసరాలకు సరిపోకపోతే మళ్లీ మంజూరు చేయిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఈ దఫా వరి ఎక్కువగా నాటారని అందువల్ల రైతుల కోసం పంట చేతికి వచ్చినపుడు ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటుతో పాటు కనీస మద్దతు ధర కూడా ఇప్పిస్తామని తెలిపారు. పార్టీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, వ్యవసాయ శాఖాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.